క్లుప్తంగా

బలరామావతారంలో జగన్నాథుడు



బలరామావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

మునగపాక: మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు శుక్రవారం బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో జగన్నాథుని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆదివారం జగన్నాథుడి పండగను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వెంకన్న ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న భక్తుడు సూర్యనారాయణ

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఆలయానికి భక్తులు తమవంతు సహకారం అందిస్తున్నారు. శుక్రవారం అనకాపల్లికి చెందిన అనకాపల్లి సూర్యనారాయణ, లక్ష్మి దంపతులు రూ.20 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలగా శ్రీనివాసరావు, అలంక సూర్యప్రకాశరావు, మహేష్, తదితరులు పాల్గొన్నారు

గ్రామాలభివృద్ధే ధ్యేయం

మునగపాక: గ్రామాలభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. మండలంలోని గంటవానిపాలెం గ్రామంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సర్పంచ్ కోన వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, దొడ్డి శ్రీనివాసరావు, మల్ల కాలేశ్వరరావు,కోన అప్పలరాజు,యల్లపు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థులపై కూటమి వేధింపులు



అనకాపల్లి: విదేశాల్లో మెడికల్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులపై పోలీసులతో కూటమి ప్రభుత్వం దాడులు చేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ డి.డి.ఎస్.ఎస్ సిద్ధార్థ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్‌ఎంసీ గైడ్‌లైన్స్ మేరకు వాళ్లంతా ఇక్కడ ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ (ఎఫ్‌ఎంజీ) ఎగ్జామ్‌లో ఉత్తీర్ణులైన తర్వాత, ఇక్కడే ఇంటర్న్‌షిప్ పూర్తి చేసినా, పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నంబర్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపితే వారిపై పోలీసులతో దాడులు చేయించడం అన్యాయమన్నారు. ఏడాదిగా ఇంటర్న్‌షిప్ పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ, ప్రైవేటు మెడికల్ కాలేజీలకు మేలు చేకూర్చేలా వీరికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (పీఆర్) నంబర్ ఇవ్వకపోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తమ పిల్లలను డాక్టర్లుగా చూడాలని తల్లిదండ్రులు అప్పులు చేసి, ఆస్తులు అమ్మి విదేశాలకు పంపించి చదివిస్తే, అలాంటి వారి కెరీర్‌ను నాశనం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. విదేశీలో మెడికల్ చదివిన వారిపై పోలీసుల దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోటవురట్ల: విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని హెల్త్ అసిస్టెంట్ కుమార్ సూచించారు. గొట్టివాడ ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు మాకవరపాలెం పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ప్రస్తుతం అనుసరించాల్సిన విధానాలు, ఆరోగ్య అలవాట్లపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, దోమలు వ్యాప్తి చెందకుండా ఇళ్ల వద్ద తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. డయేరియా వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా కాచి వడకట్టిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జీవన్, ఉపాధ్యాయురాలు గంగాభవానీ, ఆశ కార్యకర్త, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దారులు.. దారుణం.!



బురద రోడ్లో అవస్థలు పడుతూ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



జగన్నాథపురం నుంచి చీడిక వెళ్లే రోడ్డు దుస్థితి

- పోలవరం కాలువ కాంట్రాక్టర్ నిర్వాకం
- వర్షం పడితే రాకపోకలు బంద్
- చిత్తడిగా రహదారులు



సీతంపాలెం వెళ్లే రోడ్డు దుస్థితి

నక్కపల్లి: మండలంలో మెరక గ్రామాల్లో రహదారులు చాలా అధ్వానంగా తయారయ్యాయి. వర్షం పడితే చాలు ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. పోలవరం కాలువ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిర్వాకం కారణంగా ఆయా గ్రామాలకు ఈ దుస్థితి తలెత్తింది. పోలవరం కాలువకు అవతల ఉన్న పెద దొడ్డిగల్లు, సీతంపాలెం, సీతానగరం, చీడిక, దోసలపాడు, చీడిక కొత్తూరు, ముకుందరాజుపేట గ్రామాల ప్రజల బాధలు వర్ణనాతీతం. ఈ గ్రామాల నుంచి చదువుకోవడానికి గొడిచర్ల, బోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలకు వచ్చే విద్యార్థుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. చినుకుపడితే పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి.

కాలువ తవ్వకాలతో సమస్య మొదలు

ఆయా గ్రామాలకు మధ్యలో పోలవరం కాలువ ఉంది. కాలువ తవ్వకాల కోసం కాంట్రాక్టర్ గతంలో ఉన్న గ్రావెల్, తారు రోడ్లను తవ్వేశారు. వాటి స్థానంలో గ్రావెల్ అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాలి. కాని కాలువ తవ్వగా వచ్చిన మట్టితోనే తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో వర్షాలు పడిన సమయంలో కాలువ తవ్వకాల వల్ల వచ్చిన మట్టి బురదగా మారుతోంది. భారీ వర్షం పడితే ఈ రోడ్డులో పెద్ద పెద్ద గోతులు పడి నీరు చేరుతోంది. ఫలితంగా రోడ్డు మొత్తం చెరువును తలపిస్తోంది. ఈ గ్రామాల ప్రజలు ఏ అత్యవసర పనుల కోసమైన పాయకరావుపేట, తుని పట్టణాలకు రావాల్సి ఉంది. మారుమూల ఉన్న ఈ గ్రామాలకు సాయంత్రం ఏడు దాటితే ఆటోలు కూడా రావు. సైకిళ్లు, బైకులు, నాటు బళ్లపై రావాల్సిందే. కాలువ తవ్వకాలు ప్రారంభమైనప్పటి నుంచి రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో స్కూలు బస్సులు, ఆటోలు ఈ గ్రామాలకు రావడం లేదు. దీంతో విద్యార్థులు కాలినడకన ఈ బురద రోడ్డు మీదుగా ప్రయాణం చేసి పాఠశాలలకు చేరుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. వాహనచోదకులు బురద రోడ్డుపై రాకపోకలు సాగించే సమయంలో జారి పడడం, బురదలో కూరుకుపోవడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. గత మూడు రోజుల పాటు ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు ఈ రోడ్డు మరీ దారుణంగా తయరైంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి బురద రోడ్డుపై కనీసం గ్రావెల్ వేసి చదును చేయిస్తే రాకపోకలకు కొంత వరకు ఇబ్బంది తప్పుతుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా ఉన్న పెద దొడ్డిగల్లు రోడ్డు

3 నెలలుగా అవస్థలు



నక్కపల్లి నుంచి వెదుళ్లపాలెం, సీతంపాలెం, బోదిగల్లం మీదుగా పెద దొడ్డిగల్లు వెళ్లే రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయి. పోలవరం కాలువ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్లను ఇష్టానుసారం తవ్వేసి మధ్యలో వదిలేశారు. గ్రావెల్ వేసి అప్రోచ్ రోడ్డు వేయాలి. నిర్లక్ష్యంగా వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు చాలా ఇబ్బంది పడుతున్నాం. దాదాపు 3 నెలల నుంచి ఇదే పరిస్థితి ఉంది. రాత్రి సమయంలో ఏదైనా అత్యవసరమైతే ఏంటి పరిస్థితి. ఎవరికైనా సుస్తీ చేసి ఆస్పత్రికి వెళ్లాలంటే నరకం అనుభవించాల్సిందే. ఆటోలు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– గొర్ల గోవిందు, ఎంపీటీసీ, సీతంపాలెం

ఘనంగా ప్రారంభమైన సప్తాహం



మునగపాక సాయిబాబా ఆలయంలో సప్తాహ కార్యక్రమం ప్రారంభిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: మునగపాక సాయిబాబా ఆలయంలో శుక్రవారం సప్తాహం కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ దిమ్మల అప్పారావు ప్రారంభించారు. జై సాయి జైజై సాయి నామ స్మరణతో మునగపాక మార్మోగింది. పలువురు భక్తులు సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ నెల 10వ తేదీ వరకు సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ ఛైర్మన్ బొడ్డేడ వీరేంద్ర తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా అదేరోజు ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు.

మండల సర్వేయర్‌గా రవీంద్రపాల్ దాస్

మునగపాక: మునగపాక మండల సర్వేయర్‌గా రవీంద్రపాల్ దాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక రెవెన్యూ కార్యాలయ సర్వేయర్‌గా పని చేసిన శ్రీనివాసరావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో అచ్యుతాపురం సర్వేయర్‌కు ఇప్పటి వరకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రెవెన్యూ అధికారుల బదిలీల్లో భాగంగా విశాఖ కలెక్టర్ కార్యాలయంలో సేవలందిస్తున్న రవీంద్రపాల్ దాస్‌ను మునగపాక మండల సర్వేయర్‌గా నియమించారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు సచివాలయ సర్వేయర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఎస్.రాయవరం: గాజువాక, సింహాద్రి ట్రాన్స్‌కో స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ షట్‌డౌన్ కారణంగా ఆదివారం కొరుప్రోలు, ఎస్.రాయవరం, ధర్మవరం, పెదగుమ్ములూరు, దార్లపూడి, యలమంచిలి మండలం యలమంచిలి, పెదపల్లి, పురుషోత్తపురం సబ్ స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. తెల్లవారుజాము 4 నుంచి ఉదయం 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

మునగపాక: మండలంలోని చూచుకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా చూచుకొండ, గణపర్తి, నరేంద్రపురం, పల్లపు ఆనందపురం, కుమారపురం గ్రామాల్లో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే అసౌకర్యానికి రైతులు సహకరించాలని ఆయన కోరారు.

అల్లూరి ఆశయ సాధనే లక్ష్యం కావాలి



నక్కపల్లిలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు



గుడివాడలో అల్లూరి విగ్రహం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచుతున్న క్షత్రియ సంఘు నాయకులు



వేంపాడులో క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో..

నక్కపల్లి: దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసం ప్రాణాలర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. అల్లూరి 128వ జయంతి వేడుకలు శుక్రవారం నక్కపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. వేంపాడులో క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, క్షత్రియ పరిషత్ నాయకులు మణిరాజు, చినపేర్రాజు, అప్పలరాజు తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి అల్లూరి చేసిన సేవలకు గుర్తుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాడేరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేసి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నెల్లిపూడి సర్పంచ్ చినపేర్రాజు, ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి, క్షత్రియ సంఘ నాయకులు దశరథరాజులను సన్మానించారు. వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచ్‌లు సురేష్ వర్మ, చినపేర్రాజు, సాదిరెడ్డి శ్రీను, భార్గవ్, ఎంపీటీసీలు కుంచా మధు, బచ్చలరాజు, కనకారావు, చంద్రరావు, తిరపతిరావు, పక్కుర్తి రమణ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: అల్లూరి జయంతి వేడుకలకు గుడివాడ, గుర్రాజుపేట, ధర్మవరం అగ్రహారం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గుడివాడలో వైఎస్సార్‌సీపీ నాయకులు, క్షత్రియ సంఘ నాయకులు శ్రీపతిరాజు, అచ్చిరామరాజు, సర్పంచ్ దూళి శ్రీనివాసరావు తదితరులు అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు స్వీట్లు పంచారు. గుర్రాజుపేటలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ.. అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఉపసర్పంచ్ రామకృష్ణంరాజు, పాఠశాల కమిటీ చైర్మన్ బాలాజీ, దాట్ల రామరాజు, గుర్రాజుపేట ఉప సర్పంచ్ దాట్ల రాజాన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: కె.వెంకటాపురంలో అల్లూరి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు సత్యనారాయణ, యువకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : మల్లవరం గ్రామంలో అల్లూరి విగ్రహానికి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ నాయకుడు రొంగలి రాము ఆధ్వర్యంలో హరిపాలెం, తిమ్మరాజుపేట గ్రామాల్లోని అల్లూరి విగ్రహాలకు పూల మాలలు వేసి యూనియన్ నాయకులు అంజలి ఘటించారు.



కె.వెంకటాపురంలో అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు



మల్లవరంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

విత్తనాల మొలక శాతం తెలుసుకోవాలి



రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సాయి

పాయకరావుపేట: రైతులు వరి విత్తనాల మొలక శాతం తెలుసుకుని, కట్టుకోవాలని ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ కె.సాయి తెలిపారు. మండలంలోని మంగవరం, నామవరం రైతు సేవా కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మండలంలో సుమారు 910 క్వింటాళ్ల వరి విత్తనాలను వివిధ ఆర్‌ఎస్‌కేలలో అందుబాటులో ఉంచామన్నారు. ఆర్‌ఎస్‌కే సిబ్బంది విత్తనాల మొలక శాతం కట్టి రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. మండలంలో సుమారు 6,575 ఎకరాలు వరి సాధారణ సాగు కాగా.. అందుకు అనుగుణంగా వరి విత్తనాలు ఆర్‌జీఎల్ 2537 శ్రీకాకుళం సన్నాలు, మార్టేరు 1061 ఇంద్ర, 1064 అమర, 1121 శ్రీధృతి, 1224 మార్టేర్ సాంబ, 1262 మార్టేర్ మసూరి విత్తనాలు ఉన్నాయన్నారు. ఈ క్షేత్ర పర్యటనలో ఇన్‌చార్జ్ ఏడీ ఎ.ఉమాప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి ఆదినారాయణ, ఏఈవో నాగమణి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది శ్రవణ్, రైతులు పాల్గొన్నారు.

కాకరాపల్లిలో గనుల శాఖాధికారుల పర్యటన



కాకరాపల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న గనుల శాఖాధికారులు

మునగపాక: పాటిపల్లి రెవెన్యూ పరిధిలోని కాకరాపల్లిలో గతంలో గ్రావెల్ తవ్విన ప్రాంతాన్ని శుక్రవారం గనుల శాఖాధికారులు పరిశీలించారు. కాకరాపల్లికి చెందిన పిట్టా తినమంగారెడ్డి తనకు కేటాయించిన డీ-పట్టా భూమిలో కొంత మంది గ్రావెల్ తరలించుకుపోయారంటూ గత నెల 23న స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదాయానికి, తనకు తీరని నష్టం జరిగిందని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత మైన్స్ అధికారులు కాకరాపల్లిలో గ్రావెల్ తవ్విన ప్రాంతాన్ని పరిశీలించారు. ఫిర్యాదుదారుడైన మంగారెడ్డికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని గనుల శాఖాధికారులు తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా మురళీధర్ బాధ్యతల స్వీకరణ



ఇన్‌చార్జి తహసీల్దార్ మురళీధర్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు,నేతలు

మునగపాక: మునగపాక ఇన్‌చార్జి తహసీల్దార్‌గా మురళీధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బుచ్చెయ్యపేట మండల డీటీగా పని చేసిన మురళీధర్‌ను స్థానిక డీటీగా నియమించారు. ప్రస్తుతం ఆయనకు ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలను కూడా ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ మేరకు తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయనను వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, భీశెట్టి గంగప్పలనాయుడుతో పాటు పార్టీ సీనియర్ నేతలు దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ సత్కరించారు. వీఆర్వోలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, తదితరులు కూడా మురళీధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మాజీ

మునగపాక: ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ కోరారు. ఈ మేరకు పోస్టర్‌ను శుక్రవారం ఆయన మునగపాకలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందన్నారు. లేబర్ కోడ్ అమలులోకి వస్తే కార్మికులకు ప్రయోజనం ఉండదన్నారు. మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టెక్కలి జగ్గారావు, రంగాల పైడికొండ, కాకి రాంబాబు, ప్రసాద్, శ్రీను, ఈశ్వరరావు, చిన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి



నక్కపల్లిలో రంగా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాయకరావుపేటలో రంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న కాపు నాడు నాయకులు




ఎస్.రాయవరంలో వంగవీటి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బొలిశెట్టి, యువకులు

నక్కపల్లి: కాపునాయకుడు వంగవీటి మోహన్‌రంగా జయంతిని శుక్రవారం నక్కపల్లిలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రంగా ఎంతో కృషి చేశారని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎ.మణిరాజు, సర్పంచ్‌లు పాడగట్ల వెంకటేష్, సాదిరెడ్డి శ్రీను, తళ్ల భార్గవ్, సురేష్ వర్మ, ఎంపీటీసీలు గొర్ల గోవిందు, తిరుపతిరావు, కె.బుజ్జి, పక్కుర్తి రమణ, పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో ఉన్న వంగవీటి రంగా విగ్రహానికి ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు స్థానిక యువకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల యువకులు లింగంపల్లి జ్యోతికుమార్, తేటకాయల అరవింద్, పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని జీవీఆర్ నగర్‌లో ఉన్న వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి కాపు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షుడు జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడిగా కొమిరాల నాగార్జునను నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి తిరుమల్లేశ్వరరావు, కాపు నాడు నాయకులు మజ్జూరి నారాయణరావు, యాళ్ళ సన్నబాబు, జగతా శ్రీను, జి.వి.వి.సత్యనారాయణ, గొల్లపల్లి నాగు, గొంతిన అనిల్, డీలర్ కనకరాజు, మల్లపురెడ్డి రమాకుమారి, నారపురెడ్డి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు. గుంటపల్లి, అరట్లకోట గ్రామాల్లో ఉన్న వంగవీటి రంగా విగ్రహాలకు కాపు నాయకులు పూల మాలలు వేసి అంజలి ఘటించారు.

ఎంపీపీగా బొలిశెట్టి ప్రమాణ స్వీకారం నేడు



గోవిందరావు

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొణతాల శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, సర్పంచ్‌లు తరలిరావాలని కోరారు.

పారిశుధ్య మెరుగుకు సహకరించాలి



తంగేడులో చెత్త సేకరణ చేయిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: మండలంలోని బి.కె.పల్లి, పి.తంగేడు గ్రామాలలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ రఘురాం గ్రామాలలో ఇంటింటికి పర్యటించి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులతో చెత్త సేకరణ చేపట్టారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రక్షిత మంచినీటి పథకాలలో క్లోరినేష్ వివరాలు తెలుసుకుని, నీటి నమూనా సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ప్రతి ఒక్కరూ పారిశుధ్య మెరుగుకు సహకారం అందించాలని కోరారు.

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం



వాడ్రాపల్లిలో పర్యటిస్తున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి అన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో శుక్రవారం ఆమె పర్యటించారు. సంపద తయారీ కేంద్రం పరిశీలించిన ఆమె గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. తద్వారా తయారయ్యే ఎరువులను వర్మీగా ఉపయోగించుకోవాలన్నారు. పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టడంతో పాటు సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఈవోఆర్డీ సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.